# కాలశిల్పం

ప్రతిబింబం కదలదు

నీ వంకే చూస్తుంటుంది

అద్దాన్ని బద్దలు కొట్టినా. .

అతుక్కున్న ఏదో ముక్కలో

తొంగి చూస్తూనే ఉంటుంది.

శిల్పంగా మారిన ప్రతిబింబం

కదలక పడి ఉంటుంది.

చూడకు సూటిగా కళ్ళల్లోకి

ప్రాణం పోసుకు. . నడిచివస్తుంది.

నడుస్తూనో. . తడుస్తూనో

ఊపిరి విడుస్తూనో

నవ్వుతూనో. . ఏడుస్తూనో

పలుకరిస్తూనో. .

శిల్పాలుగా  మారిన

ప్రతిబింబాలు

చిత్రంగా పేరుకుపోతుంటాయి.

పెకలించకు ఆసక్తిగా..

చర్మాన్ని తొడుక్కుని

కంఠం తగిలించుకొని..

నర్తించడం మొదలెడతాయి.

శిల్పాల నీడలో శయనించకు-

శిల్పాలుగా మారని ప్రతిబింబాలు

నీ చుట్టూచేరి చూస్తుంటే

ఆ చూపుల వేడిలో..చల్లదనంలో
పడి..

కళ్ళూ..చూపూ
పోగొట్టుకొని..

నీవే ఒక శిథిలశిల్పమై..

నిశ్చలంగా

మౌనసమాధిలో

ఒరిగిపోతావు.

05.05.91